
# ట్విన్స్



"ఇందులో పరిశోధించడానికేముంది ప్రదీప్! ఆయన కాలుజారి మెట్ల మీద నుండి పడ్డాడని, హాస్పిటల్‌కి తీసుకెళ్ళేలోపు మరణించాడని కుటుంబ సభ్యులందరూ చెపుతున్నారు కదా!" డిటెక్టివ్ విక్రమ్ సి.ఐ. ప్రదీప్‌కేసి అదోలా చూస్తూ అన్నాడు.

"కరక్ట్!... శవం తాలూకూ పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ వచ్చేవరకూ నేనూ కామన్ డెత్ అనే అనుకున్నాను. కాని గత కొద్ది రోజులుగా ఆయన మీద విషప్రయోగం జరుగుతోందని, స్లో పాయిజన్ ద్వారా తనని చంపాలని ఎవరో ప్లాన్ చేసారని తెలిసాక నేనూ షాకయ్యాను. ఎలాగైతేనేం 'ఒక ప్రముఖుడు పోయాడులే' అని సరిపెట్టుకుందామనుకున్నాను. ఐతే మనసూరుకోవడంలేదు. తన శత్రువులెవరో తెలుసుకోవాలనిపిస్తోంది."

ప్రదీప్ నవ్వాడు.

"తెలుసుకుని ఏం చేస్తావ్?"

"చట్టం తన పని తను చేసుకుపోతుంది."

ఇద్దరూ నవ్వుకున్నారు.

⁂

పురుషోత్తమాచార్య ప్రముఖ ఇండస్ట్రియలిస్ట్. అతడికి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు రాజీవ్ యు.కె.లో వుంటూ, అక్కడి వ్యాపారాలు చూసుకుంటున్నాడు. రెండవవాడు రఘువీర్ ఈమధ్యనే కాలేజీ చదువు ముగించుకున్నాక, ప్రేమ వివాహం చేసుకున్నాడు.

ఆ ఇంట్లో పురుషోత్తమాచార్య తోపాటు రఘువీర్, కోడలు శార్వాణి, ఇద్దరు పనివాళ్ళు వుంటున్నారు. కొడుకు, కోడలు ఈ నేరం చేయవలసిన అవసరం లేదు కాబట్టి ఆ ఇద్దరు పనివాళ్ళలో ఎవరు నేరస్తుడో తెలుసుకోవాలి. బట్, జరిగే ఇన్వెస్టిగేషన్ హంతకుడికోసం జరిగే వేటలా వుండకూడదు. మరెలా?!

డిటెక్టివ్ విక్రమ్ మొదటిరోజు ఓ పనివాడిని ఫాలో అయ్యాడు. అతడు ఇల్లు చేరుకున్నాక, పరిసరాలను పరిశీలించాడు. నిరుపేదలుండే ఏరియా అది.

అక్కడ ఇరుగుపొరుగు నుండి, పాన్ డబ్బావాలా నుండి కొంత ఇన్‌ఫర్మేషన్ సేకరిస్తే అతగాడిని అనుమానించవలసిన అవసరం లేదనిపించింది. పైగా అతడు ఆ ఇంట్లో గత పదిహేనేళ్ళుగా నమ్మకంగా పని చేస్తున్నాడని తెలిసాక ఆ పనివాణ్ని అనుమానితుల జాబితాలోనుండి తొలగించాడు డిటెక్టివ్ విక్రమ్.

ఇక మిగిలింది రెండో పనివాడు. పురుషోత్తమాచార్యను హత్యచేసే అవకాశం, అవసరం అతడికే ఎక్కువేమోననిపిస్తోంది. అందులోనూ అతడు ఆ ఇంట్లో పనికి కుదిరి కేవలం నాలుగు నెలలే అయ్యింది- అని ఇన్‌ఫర్మేషన్ అందింది.

డిటెక్టివ్ విక్రమ్ అతడిని ఫాలో అయ్యాడు. మిడిల్ క్లాస్ వుండే ఏరియాలో అతడి నివాసం. స్థాయికి మించిన పరిసరాలలో నివాసం!

అసలు ఎవరితడు?!... ఇతడు ఆ ఇంట్లోకి ఎలా ప్రవేశించగలిగాడు?!

'ఈ విషయంలో ప్రదీప్ సహాయం తీసుకోవాలనిపించింది'. అందుకే అతడికి ఫోన్ చేసాడు. "హలో ప్రదీప్! నీ కేసు విషయంలో నువ్వే నాకో సహాయం చెయ్యాలి."

"చెప్పు."

విక్రమ్ చెప్పాడు. "... బట్,... రఘువీర్‌కి నువ్వు ఎందుకు ఆ ఇన్‌ఫర్మేషన్ అడుగుతున్నావో అర్థంకాకూడదు. అనుమానం రాకూడదు. సరేనా?"

"అలాగే."

"నాకా ఇన్‌ఫర్మేషన్ ఎప్పుడు అందుతుంది?"

"రేపు మార్నింగ్."

"ఎదురు చూస్తుంటాను." అని ఫోన్ కట్ చేసాడు విక్రమ్.

⁂

మర్నాడు- ప్రదీప్‌నుండి వచ్చిన ఇన్‌ఫర్మేషన్ వినడంతోనే విక్రమ్ నమ్మలేనట్టుగా రిపీట్ చేసాడు. "వాట్!... ఆ పనివాడిని పనిలో పెట్టుకుంది రఘువీర్ భార్యనా?"

"అవును! అంతకుముందున్న పనివాణ్ని మాన్పించేసి, ఇతణ్ని పనిలో చేర్చుకుందట."

కొద్ది క్షణాల తర్వాత "సరే! నాకు అవసరమనుకుంటే, మరోసారి ఫోన్ చేస్తాను. ప్రస్తుతానికి ...బై..." ఫోన్ కట్ చేసాడు విక్రమ్.

"రఘువీర్ భార్య...?!... పురుషోత్తమాచార్య ఆమెకు మామగారు... ఊహుఁ! లింక్ దొరకడం లేదు.

ఒకవేళ ఆ పనివాడు ఏదోలా బెదిరించో, భయపెట్టో ఆమె ద్వారా పనిలో చేరినట్టు ఆ ఇంట్లో ప్రవేశించాడా?!..."

అతడు బైక్‌లో ఆ ఏరియా చేరుకున్నాడు. తనను ఎవ్వరూ గమనించడం లేదని తెలిసాక, వేగంగా ఆ ఇంటి వైపు అడుగులేసాడు. డూప్లికేట్ కీ ఉపయోగించి తాళం తీసాక ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంటికి తాళం వేయడమంటే తాను ఒంటరివాడన్నమాట.

'ఒక వ్యక్తి మరో వ్యక్తిని హత్య చేయడానికి ప్లాన్ వేసాడంటే, అందుకు కారణమేంటో ఈ వెతుకులాట ద్వారా తెలిసే అవకాశముంది.'

చిన్న హాలు, ఆనుకుని వున్న వంట గది, వెనుక బెడ్‌రూమ్... హాల్లో కనీసం కుర్చీల్లాటివి కూడా లేవు. అంటే ఆ ఇంటికి ఇతరులెవ్వరూ రారన్నది, రాకూడదన్నది ముందే నిర్ణయించుకోవడం జరిగిందన్నమాట.

వంటగది కూడా ఖాళీనే. సో! ఆ ఇంట్లో వండుకు తినడం లాంటివి కూడా జరగడం లేదు.

విక్రమ్ బెడ్‌రూమ్‌లో ప్రవేశించాడు. ఒక చాప, దిండు, రెండు దుప్పట్లు. కుండ, గ్లాసు... జైలు గదిని గుర్తుకు తెస్తున్నట్టే వుంది. అలాంటి గదిలో తను తెలుసుకోగలిగిన కొత్త విషయాలేముంటాయ్?... బట్! వన్ థింగ్ ఈజ్ ష్యూర్!... 'ఈ వ్యక్తి ఏదో పనిమీద ఇక్కడ తిష్టవేసాడు. ఆ పని ముగిసింది. ఇక అనుమానం రాకుండా ఇక్కడినుండి బిచాణా ఎత్తేయాలి...'

'ఆ వ్యక్తి బిచాణా ఎత్తేసేలోపే తను అతడిని పట్టుకోవాలి...' మనసులోనే అనుకుంటూ బయటకు నడవబోతున్న విక్రమ్, అడుగు ముందుకు పడనట్టుగా ఆగిపోయాడు. కళ్ళు చిట్లించి మరోసారి అటు చూసాడు.

గోడకు తగిలించి వుందా ఫొటో- కూర్చుని వున్న నడి వయసు దంపతులిద్దర్ని పట్టుకుని నిలబడి వున్న ఇద్దరు టీనేజ్ అమ్మాయిలు.

ఆ టీనేజ్ అమ్మాయిలిద్దరూ అచ్చుగుద్దినట్టు ఒక్కలాగే వున్నారు. బహుశా కలలోనైనా కావచ్చు.

విక్రమ్ జేబులోనుండి మొబైల్ తీసాడు. ఆ ఫొటోని క్లోజ్‌గా వుంచి క్లిక్‌మనిపించాడు.

ఆ ఇంటికి లాక్ చేసి బయటికొచ్చాక ప్రదీప్‌కి ఫోన్ చేసాడు. "నువ్వోసారి నా ఆఫీస్‌కి రావాలి."

"ఎందుకు?"

"ఒక ఫొటోలోని వ్యక్తులను గుర్తుపట్టాలి."

"ఓ గంటలో నేను అక్కడికొస్తాను."

⁂

మొబైల్‌లోని ఫొటో చూడడంతోనే సి.ఐ. ప్రదీప్ షాకయ్యాడు. "ఇదేంటి? ఆ ఇంటి కోడలు, ఇంటి పనివాడితో కలిసి ఫొటో దిగడమేంటి?"

"ఐతే ఈ ఫొటోలో ఒకరు ఆ ఇంటి కోడలు శార్వాణి, మరొకడు ఆ ఇంటి ప్రస్తుత పనివాడు రాములయ్య, అతడి పక్కన కూర్చున్నది తన ఇల్లాలు కావచ్చు, ఇక అచ్చుగుద్దినట్టు శార్వాణిలా వున్న ఆ అమ్మాయి... ఖచ్చితంగా శార్వాణి చెల్లెలే అయ్యుంటుంది...

జె.వి.బాబు

ఐడెంటిటీ విషయం ఒ.కే... బట్... ఈ రిలేషన్ వెనుక వున్న స్టోరీ ఏంటి? అది క్రైమ్‌కి మోటివ్ కాదు కదా?!..." తనలో తాను అనుకుంటున్నట్టే ప్రదీప్‌కి చెప్పాడు.

ప్రదీప్ కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత పలికాడు. "ఈ ఫొటో వెనుక కథ తెలిస్తే తప్ప, మనకు క్లారిటీ రాదను కుంటాను."

"మరి ఫొటో వెనుక కథ తెలుసుకోవాలంటే శార్వాణి పుట్టింటి అడ్రస్ కావాలి."

"మున్నటిలాగే మఖ్యపెట్టి రఘువీర్ నుండి ఆ అడ్రస్ సంపాదించి ఇస్తాను."

⁂

సిటీకి పాతిక కిలోమీటర్ల దూరంలోవున్న ఆ ఏరియాలో బైక్ ఆపాడు డిటెక్టివ్ విక్రమ్ బైక్‌లో ఆ ఇంటి వరకూ వెళ్ళడం సరికాదు. అందుకే ఆ ఇంటికి అర కిలోమీటర్ ముందే బైక్ ఆపి, ఓ బ్యాగ్ భుజానేసుకుని ముందుకి నడిచాడు.

"ఏమయ్యా! శార్వాణి ఇల్లెక్కడ?" దారిన వస్తున్న ఓ వ్యక్తిని అడిగితే, అతడు తనకేసి ఎగాదిగా చూసి చెయ్యెత్తి ఓ వైపు చూపించాడు.

అతడు ఆ ఇంటికి దగ్గరగా నడిచాడు. ఇంటికి తాళం వేసి వుంది. చాలా రోజులుగా ఆ ఇంటి తలుపులు తెరవలేదని, చూడగానే తెలిసిపోతోంది.

విక్రమ్ పక్కింటి తలుపు తట్టాడు.

ముప్పయ్యేళ్ళ ఓ యువతి తలుపు తీసి తనకేసి కంగారుగా చూసింది.

"నమస్కారమండీ! నేను శార్వాణికి దూరపు చుట్టాన్ని. ముంబాయి నుండి వచ్చాను. తనను కలసి వెళ్దామని..." అంటూ నసిగాడు."ఇంటికి తాళం వుంది. ఎక్కడికెళ్లారో చెపితే...?!"

ఈసారి ఆమె అతడికేసి అనుమానంగా చూసింది. "ఐతే నువ్వు వాళ్ళకు బాగా దూరపు చుట్టానివా?!"

"అంటే... మరీ దూరపు బంధువని కాదనుకోండి. కాని మా మధ్య రాకపోకలు తక్కువ. నేను హైదరాబాద్ వస్తున్నానని, మా అమ్మ ఖచ్చితంగా కలవమని చెప్పింది. అందుకే ఇలా అడ్రస్ వెతుక్కుంటూ వచ్చాను."

ఆమె ముఖంలో కాసింత నమ్మకం కదలాడింది. "అదా సంగతి! అందుకే మీకు శార్వాణికి పెళ్ళయిపోయిన విషయం కూడా తెలియదనుకుంటాను."

అతడు ఆశ్చర్యపోయినట్టు నటించాడు. "శార్వాణికి పెళ్ళయ్యిందా?!... ఎప్పుడు..: ఎవరితో?!"

"మూడు నెలలయ్యింది... తను ప్రేమించిన కుర్రాడ్నే పెళ్ళిచేసుకుంది. అతడి పేరు రఘువీర్. బాగా డబ్బున్నోళ్ళులే... "కొద్దిపాటి అసూయ ఆ స్వరంలో ధ్వనించినట్టనిపించింది.

ఈసారి గాలిలో బాణంలాంటి ప్రశ్న వదిలాడు. "మరి తన చెల్లెలు... పేరు..." గుర్తు తెచ్చుకుంటున్నట్టుగా తల గోక్కోసాగాడు.

ఆమె ముఖంలో అదోలాంటి మార్పు. "శివాని... శివాని చనిపోయిందిగా?!" అంది.

"ఛ... చనిపోయిందా?!... ఎలా?!... ఎప్పుడు?!"

"చనిపోయి మూడు నెలలే అయ్యింది... ఎలా చనిపోయిందంటే... "అంతలోనే సర్దుకుని"... అవన్నీ నాకెందుకులేండి. మూడు నెలలుగా ఆ ఇంట్లో ఎవ్వరూ లేరు. అదీ విషయం" ఇక 'మీరెళ్తారా?' అన్నట్టు తనకేసి చూసింది.

చాలా ఇన్ఫర్మేషనే తెలిసింది. కాని తెలుసుకోవలసింది ఇంకా ఎంతో వుంది. అందులో ముఖ్యమైనది- ఆ పనివాడు రాములయ్య విషయం.

"ఇంత చెప్పారు. మరొక్క విషయం చెపితే- నేను రిలాక్స్‌గా ముంబాయి వెళ్ళిపోవచ్చు. ... అదే మా మామయ్య రాములయ్య గురించి..."

"రాములయ్యా?!" ఆమె అయోమయంగా చూసింది.

అతడు చప్పున జేబులోనుండి మొబైల్ తీసాడు. అందులోనున్న ఫొటో చూపించగానే ఆమె అంది "ఓహో! నారయ్యగారా!... ఆయన్ని రాములయ్య అంటారేంటి?"

"మా అమ్మ తననలాగే పిలిచేది... ఆయన ఇప్పుడెక్కడున్నాడు?!"

"శార్వాణి పెళ్ళయ్యాక తనూ ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఎక్కడికెళ్ళాడో తెలియదు."

ఆమెను ఇంక ఏం ప్రశ్నించినా జవాబు రాదని తెలుసు. అందుకే "ఉంటానండి" అంటూ బయల్దేరాడు.

మెల్లగా ముందుకు నడుస్తూ అందిన ఇన్ఫర్మేషన్ విశ్లేషించుకోసాగాడు. "అక్కా చెల్లెళ్ళు. ... ఇద్దరూ ఒకే పోలిక... అందులో ఒకరు చనిపోయారు. ఆమె ఎలా చనిపోయిందో తెలియదు... కాని ఆమె చనిపోయిన వెంటనే శార్వాణి ప్రేమించిన వాడిని పెళ్ళిచేసుకుంది. అప్పటివరకూ వాళ్ళను అంటిపెట్టుకుని వున్న ఆ వ్యక్తి ఎక్కడికో వెళ్ళిపోయినట్టు, శార్వాణి ఇంటిలోనే పనివాడిగా పేరు మార్చుకుని జాయినైపోయాడు... ఎందుకు?!..."

**"అక్కా చెల్లెళ్ళు. ... ఇద్దరూ ఒకే పోలిక... అందులో ఒకరు చనిపోయారు. ఆమె ఎలా చనిపోయిందో తెలియదు... కాని ఆమె చనిపోయిన వెంటనే శార్వాణి ప్రేమించిన వాడిని పెళ్ళిచేసుకుంది. అప్పటివరకూ వాళ్ళను అంటిపెట్టుకుని వున్న ఆ వ్యక్తి ఎక్కడికో వెళ్ళిపోయినట్టు, శార్వాణి ఇంటిలోనే పనివాడిగా పేరు మార్చుకుని జాయినైపోయాడు... ఎందుకు?!..."**

పోగొట్టుకున్నచోటే వెతుక్కోవాలన్నట్టు, శార్వాణి పుట్టి పెరిగిన చోటే మరింత సమాచారం సేకరించాలి.

విక్రమ్ ఓ పాన్‌షాప్ కుర్రాడికి మాటల్లో పెట్టాడు. వాడు అందించిన సమాచారం అతడ్ని షాకయ్యేలా చేసింది.

'శార్వాణి చెల్లెలు శివాని హత్య చేయబడింది. హత్య చేయించింది శార్వాణిని ప్రేమించిన కుర్రాడి నాన్నగారు. అది కూడా... శివానిని, శార్వాణి అనుకుని...'

అతడు సిటీకి చేరుకున్నాడు.

⁂

రాములయ్య ఉరఫ్ నారయ్యను అదుపులోకి తీసుకున్న సి.ఐ. ప్రదీప్, అతడి ముందు రెండు ఛాయిస్‌లుంచేలా విషయాన్ని వివరించాడు. "నారయ్యా! డిటెక్టివ్ విక్రమ్ మీ తాలూకూ ఇన్ఫర్మేషనంతా సేకరించారు. పురుషోత్తమాచార్య కొడుకు రఘువీర్ శార్వాణిని ప్రేమించడం, ఆ ప్రేమను అంగీకరించలేని ఆయన శార్వాణిని చంపడానికి ప్లాన్ చేసి గూండాలను పురమాయించడం, ఫొటో పట్టుకుని వెళ్ళిన గూండాలు, శార్వాణి అనుకుని శివానిని హత్యచేయడం... ఇంకా చాలా ఇన్ఫర్మేషన్ వుంది. ఐతే మీరే హత్యకు ప్లాన్ చేయడం గురించి నీ మాటల్లో చెపితే, కనీసం శార్వాణైనా కేసు నుండి తప్పించే అవకాశముంటుంది... లేదంటే, రఘువీర్‌కి ఇన్ఫర్మేషనంతా వివరించాల్సి వుంటుంది."

"వద్దు...వద్దు..." అతడు చేతులడ్డంగా ఆడించాడు... "రఘువీర్‌కి ఇదంతా తెలియడం మంచిది కాదు. నేనే ఈ నేరాన్ని అంగీకరిస్తున్నాను..."

"గుడ్. మరి పురుషోత్తమాచార్యను ఎందుకు హత్య చేయవలసి వచ్చిందో కూడా క్లియర్‌గా చెపితే, రికార్డ్ చేసుకుంటాం."

నారయ్య చెప్పడం ప్రారంభించాడు. "శార్వాణి, శివానిల తండ్రి నాకు వరుసకు అన్నయ్య అవుతాడు. ఆయన నా కుటుంబాన్ని చేరదీసి, తన దగ్గరే వుంచుకున్నాడు. నాకు పిల్లల్లేకపోవడంతో ఆ ఇద్దరు పిల్లల్నే నా పిల్లలుగా భావించాను. ఓసారి యాత్రలకంటూ వెళ్ళిన అన్నయ్య, వదినలతోపాటు, నా భార్య కూడా బస్సు యాక్సిడెంట్‌లో మరణించింది. అప్పటినుండి ఆ ఆడపిల్లల బాధ్యత కూడా నా మీద పడింది. శార్వాణి కాలేజీ చదువులకెళ్తుంటే, రఘువీర్‌తో పరిచయమయ్యింది. వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. ఈ విషయం తెలిసిన రఘువీర్ తండ్రి శార్వాణిని చంపించాలని ప్లాన్ చేసాడు. ఓరోజు ఫ్రెండ్ ఇంటికెళ్ళి వస్తున్న శివానిని గూండాలు ఎత్తుకుపోయి, చంపి ఊరి చివరపడేసారు... మాకంటూ ఎవరూ శత్రువులు లేరు. అప్పటికే పురుషోత్తమాచార్య శార్వాణిని పిలిచి బెదిరించి వుండడంతో ఆ హత్య ఎలా జరిగి వుంటుందో నాకూ, శార్వాణిని పిలిచి బెదిరించి వుండడంతో ఆ హత్య ఎలా జరిగి వుంటుందో నాకూ, శార్వాణికి అర్థమయ్యింది. కాకపోతే తనను కుని, తన చెల్లెల్ని ఎత్తుకుపోయి ఆ దారుణం చేయడంతో శార్వాణి దుఃఖం ఆగలేదు. తన ముద్దుల చెల్లెల్ని చంపించిన వాడిని వదలకూడదనుకుంది. అందుకే రఘువీర్‌తో పట్టుబట్టి గుడిలో పెళ్ళిచేసుకుని, ఆ ఇంట్లో కోడలిగా అడుగుపెట్టింది. తనకు నా సహాయం కావాలి. అందుకే ఉన్న పనివాడిని తీసేసి, పనివాడిగా నన్ను ఆ ఇంట్లో ప్రవేశపెట్టింది... పురుషోత్తమాచార్యకు రోజూ పాలు తాగే అలవాటుంది. అందులో పాయిజన్ కలిపేవాడిని. స్లో పాయిజన్ ద్వారా తనను నిర్వీర్యంచేసి, మంచాన పడేలా చేసి, ఆ తర్వాత మాటలతో, చేతలతో చిత్రవధ చేయాలనేది మా ఆలోచన... కాని ఇంతలోనే అతడు మెట్ల మీద నుండి జారిపడి మరణించాడు. అతడు చేసిన పాపం తన ప్రాణాలను అలా తీసింది... ఐతే అతడిని చంపాలని ప్లాన్‌చేసిన మాట వాస్తవమే. ఈ నేరం నా మీద వేసుకుంటున్నాను... నన్ను అరెస్ట్ చేయండి" అతడు చెప్పడం పూర్తిచేసి, చేతులు రెండూ ముందుంచాడు.

సి.ఐ. ప్రదీప్‌కేసి చూసాడు విక్రమ్. "ఇప్పుడేం చేద్దాం."

అతడు అదోలా నవ్వాడు. "చట్టం తన పని తను చేసుకుపోతుంది."

"ఒక కాపురం కూల్చకూడదని నిర్ణయించుకున్నందుకు... థాంక్స్" భావం అర్థమై తనూ నవ్వాడు విక్రమ్. ★